

ఓటింగ్‌పై అవగాహన

ఆత్మకూరు: పెచ్చెర్వు చెంచుగూడెంలో శనివారం చెంచుగిరిజనులకు ఓటు హక్కు వినియోగంపై ఈఆర్‌ఓ వెంకటశివ, తహసీల్దార్ ఉమాదేవి, ఎంపీడీఓ మోహన్‌కుమార్ అవగాహన కల్పించారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళారాధనలో భాగంగా శనివారం హైదరాబాద్‌కు చెందిన విజయలక్ష్మి బృందం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



భారీగా ఎస్‌ఐల బదిలీలు

కేంద్ర ఎన్నికల సంఘం సూచన మేరకు జిల్లా పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ చేపట్టారు. శనివారం 19 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా ఈ సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

కర్నూలు(సెంట్రల్): డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో శనివారం ఇద్దరు డిబార్ అయ్యారు. చూచిరాతలకు పాల్పడుతుండగా తుగ్గలి ఏఎస్ డిగ్రీ కాలేజీలో ఒకరు, ఆలూరు శ్రీరాఘవేంద్ర డిగ్రీ కాలేజీలో మరొకరిని డిబార్ చేసినట్లు ఆర్‌యూ అధికారులు తెలిపారు. శనివారం నిర్వహించిన పరీక్షలకు 8951 మందికిగాను 5,140మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

పండుగలా పెన్షన్ పంపిణీ

- కర్నూలు జిల్లాలో 63 శాతం, నంద్యాల జిల్లాలో 74.03 శాతం పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీ పండుగ వాతావరణంలో సాగుతోంది. పెన్షన్ కానుక రూ.3వేలకు పెంపు సంబరాలు వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాలు మినహా అన్ని ప్రాంతాల్లో చేపట్టారు. ఇక కొత్తగా వైఎస్సార్ పెన్షన్ పొందుతున్న వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలో జనవరి నెలకు సంబంధించి పాత, కొత్త పింఛన్లు 2,48.072 ఉండగా.. షెడ్యూల్ ప్రకారం పంపిణీ జరుగుతోంది. శనివారం కర్నూలు రూరల్ మండలానికి సంబంధించి నందనపల్లి, ఆదోని రూరల్, మద్దికెర, చిప్పగిరిలలో పెన్షన్ కానుక పెంపు సంబరాలు చేపట్టారు. వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల్లో ఈ నెల 8న కార్యక్రమం నిర్వహించనున్నారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 1,56,290(63 శాతం).. నంద్యాల జిల్లాలో 1,65,990 (74.03 శాతం) పింఛన్ల పంపిణీ పూర్తయింది.

పక్కాగా టీహెచ్‌ఆర్ పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటలక్షుమ్మ

కర్నూలు(అర్బన్): అంగన్‌వాడీ వర్కర్లు,హెల్పర్లు సమ్మెలో ఉన్న నేపథ్యంలో జిల్లాలో టేక్ హోం రేషన్(టీహెచ్‌ఆర్) పక్కాగా పంపిణీ చేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి పి.వెంకటలక్షుమ్మ కోరారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో జిల్లాలోని సీడీపీఓలతో ఆమె సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిన నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధుల్లోకి చేరేందుకు సుముఖత చూపే వర్కర్లు, హెల్పర్ల డిక్లరేషన్ తీసుకొని విధుల్లోకి అనుమతించాలన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సమీపంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందించే ప్రక్రియను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. సమావేశంలో కార్యాలయ పర్యవేక్షకులు ఉమామహేశ్వర్‌రావు, సీడీపీఓలు అనురాధ, మద్దమ్మ, సఫ్రున్నీసాబేగం పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి 'ప్రాధాన్యం'

- మండల కేంద్రమైన మద్దికెర నుంచి నియోజకవర్గ కేంద్రమైన ఆలూరుకు మొలగవెళ్లి గ్రామం మీదుగా వెళ్లేందుకు అవకాశం ఉంది. అయితే ఈ రోడ్డు పూర్తి అధ్వానంగా మారడంతో వాహనాలు అనంతపురం జిల్లా గుంతకల్లు మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం హై ఇంపాక్ట్ రోడ్డు పనుల్లో భాగంగా మద్దికెర నుంచి ఆలూరుకు (14.90 కి.మీ) రూ.8.15 కోట్లతో రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. దీంతో ప్రయాణికులకు దూరం తగ్గడమే గాక, సమయం కూడా ఎంతో ఆదా అవుతోంది. ఈ పనులను ఇటీవలే పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భూమి పూజ చేసి ప్రారంభించారు.
- కోడుమూరు నుంచి కృష్ణాపురం వెళ్లేందుకు 4.10 కిలోమీటర్ల రోడ్డు ఉంది. ఇది గుంతలు పడి, మట్టితేలి కనీసం వాహనాలు వెళ్లేందుకు కూడా వీలులేని దుస్థితిలో ఉంది. ఈ రోడ్డు మీదుగా కృష్ణగిరి మండలంలోని పలు గ్రామాలకు సులభంగా చేరుకునేందుకు అవకాశం ఉంది. దీనిని హైఇంపాక్ట్ రోడ్డుగా గుర్తించారు. రూ.2.97 కోట్లతో పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఇటీవలే పనులకు భూమి పూజ నిర్వహించారు.
- ఆత్మకూరు మండలం వడ్లరామాపురం నుంచి కొట్టాలచెరువు వరకు 5.50 కిలోమీటర్ల మేర రూ.7.10 కోట్లతో రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. దీంతో ఈ రెండు గ్రామాలతో పాటు కురుకుంద, వరదరాజ స్వామి ప్రాజెక్టుకు వెళ్లేందుకు మార్గం సుగమం కానుంది.

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో చురుగ్గా హైఇంపాక్ట్ రోడ్ల పనులు
- రూ.189.27 కోట్లతో అభివృద్ధి చెందుతున్న రహదారులు
- 257.79 కిలోమీటర్ల మేర బాగుపడనున్న 39 రోడ్లు
- ఇప్పటికే 24 పనులు ప్రారంభం.. టెండర్ దశలో మరో 15



అభివృద్ధి చెందనున్న వడ్లరామాపురం - కొట్టాలచెరువు రోడ్డు



రూపురేఖలు మారనున్న మద్దికెర - ఆలూరు రోడ్డు

కర్నూలు(అర్బన్): నాగరికతకు చిహ్నాలైన రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఎక్కడా గతుకులు లేకుండా ప్రయాణం సాఫీగా సాగేలా రోడ్లను బాగు చేస్తోంది. టీడీపీ హయాంలో వివిధ రోడ్లను నాసిరకంగా నిర్మించారు. దీంతో అవి కొన్నినెలలకే కంకర, రాళ్లు తేలి అధ్వానంగా తయారయ్యాయి. వాహనాదారులు, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధికి నోచుకోని రహదారులను బాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రాధాన్యత కలిగిన రోడ్లను గుర్తించి, వాటిని అభివృద్ధి చేసేందుకు సీఎంఓ నుంచి ప్రత్యేక ఆదేశాలు వచ్చాయి. దీంతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు కర్నూలు జిల్లాలో 11, నంద్యాల జిల్లాలో 28 రోడ్లను ప్రాధాన్యత కలిగినవిగా గుర్తించి ప్రతిపాదనలు పంపారు. పనులు చేపట్టేందుకు వెంటనే ఆమోదం లభించింది. అంతేకాకుండా రూ.187.27 కోట్లతో పాలనా అనుమతులు సైతం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి పీఆర్‌అండ్‌ఆర్‌డీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ రాజశేఖర్ గత ఏడాది అక్టోబర్ 30న జీఓఆర్‌టీ నంబర్: 726ను జారీ చేశారు. పాలనా అనుమతులు లభించిన ఆయా పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేసేందుకు పీఆర్ ఇంజినీరింగ్ వర్గాలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మొత్తం 39 పనులకు సంబంధించి రెండు జిల్లాల్లో 24 పనులు ప్రారంభం కాగా, మిగిలిన 15 పనులు టెండర్ దశలో ఉన్నాయి. టెండర్ దశలో ఉన్న వాటిని కూడా పురోగతిలోకి తీసుకురానున్నారు.

మెరుగుపడనున్న రవాణా సౌకర్యాలు

పనులు పూర్తయితే ఉమ్మడి జిల్లాలో 257.79 కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లు అభివృద్ధి చెందనున్నాయి. సీఎంఓ నుంచి అందిన ఆదేశాల మేరకు పీఆర్ ఇంజినీర్లు క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఎక్కువ ఉపయోగ పడే అధిక ప్రాధాన్యత కలిగిన రోడ్లను గుర్తించారు. ఈ రోడ్ల పనులు పూర్తయితే దాదాపు వంద గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.

ఎంతో ఉపయోగం



మద్దికెర నుంచి మొలగవెళ్లి మీదుగా ఆలూరు వరకు రోడ్డును అభివృద్ధి చేయడం వల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ రోడ్డు పూర్తి అధ్వానంగా మారడం వల్ల వాహనాలపై వెళ్లేందుకు చాలా ఇబ్బందిగా ఉంది. ఈ రోడ్డు పూర్తయితే దాదాపు 20 కిలోమీటర్ల దూరం తగ్గడమే గాక, సమయం కూడా ఆదా అవుతుంది. – పరశురాముడు, మద్దికెర

దశాబ్దాల కల నెరవేరుతోంది



బళ్లారి ప్రధాన రహదారి నుంచి కృష్ణాపురం గ్రామం వరకు రోడ్డును అభివృద్ధి చేయడం వల్ల ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరుతోంది. ఈ రోడ్డు బాగు పడితే కృష్ణాపురంతో పాటు క్రిష్ణగిరి మండలంలోని పోతుగల్లు, ఎరుకలచెర్వు, సంగాల తదితర గ్రామాలకు వెళ్లేందుకు సులభంగా ఉంటుంది. – చంద్రమౌళి, కృష్ణాపురం, కోడుమూరు మండలం

రైతులకు ఎంతో మేలు



వడ్ల రామాపురం నుంచి కొట్టాలచెరువుకు రోడ్డు వేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరగనుంది. రోడ్డు బాగా లేకపోవడం వల్ల రైతులు పంట ఉత్పత్తులను ఇళ్లకు చేర్చుకునేందుకు, మార్కెట్‌కు తరలించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే వరదరాజ స్వామి ప్రాజెక్టుకు కూడా ఇబ్బంది లేకుండా చేరుకునేందుకు అవకాశం ఏర్పడుతోంది. – కోట్ల నాగేశ్వరరెడ్డి, కురుకుంద గ్రామం

పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేస్తాం



ప్రభుత్వం ఆమోదించిన హై ఇంపాక్ట్ రోడ్ల పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి నాణ్యతతో పూర్తి చేయనున్నాం. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో మొత్తం 39 రోడ్లలో 24 రోడ్ల పనులు ప్రారంభం అయ్యాయి. ఈ పనులకు ఎలాంటి నిధుల కొరత లేదు. – కే సుబ్రమణ్యం, పీఆర్ ఎస్ఈ

నియోజకవర్గాల వారీగా అభివృద్ధి చెందనున్న రోడ్లు

నియోజకవర్గం	మొత్తం రోడ్లు	కిలోమీటర్లు	మొత్తం విలువ (రూ.కోట్లలో)
ఎమ్మిగనూరు	02	9.40	7.32
ఆలూరు	04	30.46	21.70
పత్తికొండ	01	14.90	8.15
కోడుమూరు	04	41.85	25.36
ఆళ్లగడ్డ	06	38.50	26.53
బనగానపల్లె	01	12.60	18.50
నంద్యాల	03	7.90	5.65
శ్రీశైలం	05	23.30	17.87
నందికొట్కూరు	05	38.00	22.78
పాణ్యం	03	16.10	7.56
డోన్	05	24.78	27.65
మొత్తం	39	257.79	189.27



ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల విధుల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైన, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు విధులు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. శనివారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సెక్టోరల్ అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ మౌర్య, ఎస్పీ జి.కృష్ణకాంత్ హాజరయ్యారు. ముందుగా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఒక్కో సెక్టోరల్ ఆఫీసర్‌కు 13 లేదా 14 పోలింగ్ స్టేషన్‌లు ఉండవచ్చని, వాటిని సెక్టోరియల్ ఆఫీసర్లు, సెక్టోరియల్ పోలీసులు సమన్వయం చేసుకొని సదుపాయాలపై తగిన నివేదిక ఇవ్వాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, ర్యాంపు, ఫర్నిచర్, విద్యుత్, టాయ్‌లెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈనెల 31లోపు ప్రతి పోలింగ్ స్టేషన్‌ను రెండు సార్లు సందర్శించాలన్నారు. పోలింగ్ స్టేషన్ ఏరియా లో ఏ సెల్ నెట్‌వర్కు పనిచేస్తుందో సంబంధిత సిమ్‌కార్డులను వాడాలని సూచించారు. 80 ఏళ్ల వృద్ధులు, 60 శాతం పైబడి వికలత్వం ఉన్న వారు ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని, వాటిని పోస్టల్ బ్యాలెట్‌గా పరిగణించాలన్నారు.

- ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ సెక్టోరల్ పోలీసు అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లలో తరచూ తనిఖీలు చేపట్టాలన్నారు. సమస్యలు సృష్టించే వ్యక్తులు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను తెలపాలన్నారు.
- మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ సెక్టోరియల్ ఆఫీసర్ల కోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశామని, అందులో ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ, డీఆర్వో కె.మధుసూధన్‌రావు, ఆర్డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మీ పాల్గొన్నారు.

వైభవంగా స్వాతి మహోత్సవం



సుదర్శన హోమం పూర్ణాహుతి కార్యక్రమంలో అర్చకులు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో శనివారం స్వాతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదుడిని యాగశాలలో కొలువుంచి వేద పండితుల వేదాలు.. ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా నవకళశ పంచామృతాలతో అభిషేకించి తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం స్వాతి, శ్రీసుదర్శన హోమాలు వైభవోపేతంగా నిర్వహించి పూర్ణాహుతితో కార్యాక్రమాన్ని ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి ఉత్సవ పల్లకీలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు మాఢ వీధుల్లో సంచరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాణ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



ఫీట్లు చేస్తూ.. పోలీసులకు సవాల్ విసురుతూ!

పోలీసులు ఉన్నారనే భయం లేదు.. ప్రధాన రహదారి అనే ధ్యాస లేదు.. చుట్టూ జనం చూస్తున్నారనే ఆలోచన లేదు.. యువత ఏ స్థాయిలో పెడతోవ పడుతున్నారో ఈ దృశ్యం చూస్తే అర్థమవుతోంది. ప్రమాదాలను కొనితెచ్చుకోవడంతో పాటు.. సామాన్యులను సైతం అందుకు బలిపెడుతున్నారు. ఇదే సమయంలో తమపైనే తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారనే విషయాన్ని విస్మరించి సాహసాలకు తెగబడుతున్నారు. ఎంతో విలువైన ప్రాణాలను గాలిలో పెట్టి.. బైక్ స్టంట్‌లు చేస్తున్నారు. శనివారం నగరంలోని గుత్తి పెట్రోల్ బంకు బ్రిడ్జి సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. వారి ఎదుటే ఓ యువకుడు ద్విచక్ర వాహనాన్ని గాలిలోకి లేపి నడుపుతూ అక్కడక్కడే ఫీట్లు చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. పోలీసులు స్పందించేలోగా ఒక్క టైర్ మీదనే ఉడాయించడం గమనార్హం. కనీసం వాహనానికి ముందు నెంబర్ ప్లేటు కూడా లేకపోవడం చూస్తే.. పోలీసులు ఇలాంటి వాహనాల పట్ల ఏస్థాయిలో అప్రమత్తంగా ఉన్నారో అర్థమవుతోంది. ఈ విషయంలో పిల్లల తప్పు ఎంత ఉందో, వీళ్లను గాలికి వదిలేసి తల్లిదండ్రుల తప్పూ లేకపోలేదనే చర్చ స్థానికుల్లో కొనసాగింది.

– డి.హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

టీకాలతో చిన్నారుల ఆరోగ్యానికి రక్ష


చిన్నారికి టీకా వేస్తున్న సిబ్బందికి సూచనలు చేస్తున్న ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): బాల్యంలో చిన్నారులకు వేసే టీకాలు భవిష్యత్‌లో వారి ఆరోగ్యానికి రక్షగా ఉంటాయని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్ కుమార్ చెప్పారు. శనివారం కల్లూరు ఎస్టేట్‌లోని భగవాన్ నగర్ సచివాలయంలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులు, ఐదేళ్ల లోపు పిల్లలకు టీకాలను క్రమం తప్పక ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేయాలన్నారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్-ఎ సిరఫ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుప్రియ, డీసీఎం ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభాగ్యులకు అ‘ద్వితీయ’ కానుక

- ఒకే ఇంట్లో ఇద్దరికి పింఛన్ల మంజూరు



నూతన పింఛన్ అందుకున్న జహీరాబితో కోడలు జైలుబి, దివ్యాంగురాలు మరియమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్లు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎలాంటి ఆధారమూ లేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఒకే ఇంటికి రెండు వైఎస్సార్ పింఛన్ కానుకలు మంజూరు చేసి మానవతను చూపుతోంది. దీంతో వారు ధైర్యంగా జీవనం సాగిస్తున్నారు. ఇటీవల మండల కేంద్రమైన వెల్దుర్తి 6వ వార్డులో ఇద్దరికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది.. ఆ వివరాలు..

అత్తా కోడళ్లకు పింఛన్

వెల్దుర్తి 6వ వార్డుకు చెందిన జహీరాబి, జైలుబీఅత్తా కోడళ్లు. జహీరాబి భర్త చిన్న దుకాణంతో జీవనం గడుపుతుండగా అతనికి పింఛన్ వచ్చేది. భర్త మృతి చెందడంతో కుమారుడు, కోడలుతో కలిసి ఉండేది. కుమారుడు సైతం మృతి చెందడంతో వారిరువురు దిక్కులేని వారయ్యారు. కోడలు ప్రతి రోజూ బన్నులు ఊర్లో అమ్మితేనే పూట గడిచేది. అనారోగ్య పరిస్థితులు సరేసరి. ఈ సమయంలో తనకు పింఛన్ కోరుతూ 84 ఏళ్ల జహీరాబి కోరగా.. వలంటీర్ ప్రసన్న కుమార్ జహీరాబికి ప్రత్యేక రేషన్ కార్డు మంజూరు చేయించారు. అనంతరం పింఛన్‌కు దరఖాస్తు చేయించడంతో జనవరి నెల మంజూరైంది. దీంతో సచివాలయం-2 వెల్ఫేర్ అసిస్టెంట్ అయ్యస్వామి, వలంటీర్ ప్రసన్న కుమార్, కాంతారెడ్డి జహీరాబికు రూ.3వేల నూతన పింఛన్ అందించారు. అత్తా, కోడళ్ల ఇద్దరికీ పింఛన్ రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భార్యాభర్తలకు...

వెల్దుర్తి 6వవార్డుకు చెందిన నాగన్న, మరియమ్మలు భార్యభర్తలు. 60 ఏళ్ల పైబడిన నాగన్న రెక్కలు సైతం కష్టపడే తత్వాన్ని కోల్పోయాయి. ఈ పరిస్థితులలో ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ అందిస్తోంది. ఈ నెల ఆ పింఛన్ రూ.250లు పెరిగి రూ.3వేలయింది. అయితే భార్య మానసిక వికలాంగురాలు కావడంతో వారి ఆరోగ్య ఖర్చులూ ఎక్కువే. ఈ పరిస్థితులలో ప్రభుత్వం సడలించిన నిబంధనలను గుర్తించిన వలంటీర్ ప్రసాద్‌బాబు దివ్యాంగురాలైన మరియమ్మకు పింఛన్ దరఖాస్తు చేయించాడు. ఈనెల ఆమెకు ప్రభుత్వం ద్వారా నూతన పింఛన్ మంజూరయింది. దీంతో వలంటీర్ ప్రసాద్‌బాబు, కాంతారెడ్డి వారి ఇంటికి వెళ్లి నూతన పింఛన్ అందించారు. ఆ ఇంట్లో ఇప్పుడు భర్తకు, భార్యకు రెండు పింఛన్లు మొత్తంగా రూ.6వేలు అందడంతో వారి జీవనానికి ఆర్థిక బలం చేకూరింది.

‘సామరస్య’ సత్కారం

ఎమ్మిగనూరుటౌన్: హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు కలసిమెలిసి ఉంటూ సామరస్యాన్ని చాటుతున్నారు. చర్చి, మసీదు, దేవాలయాల నిర్మాణాలకు ఒకరికొకరు ఆర్థిక సహకారం అందించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో క్రిస్టియన్ రిఫార్మ్డ్ చర్చి(సిఆర్‌సి) నిర్మాణానికి హిందువులు, ముస్లింలు విరాళాలు ఇచ్చారు. ఈ చర్చికి ప్రారంభమై 75 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా శనివారం వజ్రోత్సవాన్ని ప్రత్యేక ప్రార్థనలతో నిర్వహించారు. చర్చి నిర్మాణానికి సహకారం అందించిన దాతల కుమారులైన మల్లికార్జున గౌడ్, కాంట్రాక్టర్ యుసుఫ్, కౌన్సిలర్ ఇసాక్, రియల్టర్ గోపి, వెంకటబద్రీనాథ్‌లను పూలమాలలతో సత్కరించారు. ఇండియన్ క్రిస్టియన్ కౌన్సిల్ కార్యదర్శి మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, సంఘ పెద్దలు రెవరెండ్ రవుతేజ, పీఏ స్వామి, చర్చి సంఘ పెద్దలు పాల్గొన్నారు.


చర్చి నిర్మాణానికి సహకరించిన దాతల కుమారులను సత్కరించిన దృశ్యం

‘ఉపాధి’ నిధులతో అడవుల అభివృద్ధి!

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో అడవులను అభివృద్ధి చేయడానికి రంగం సిద్ధమైంది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖ ఉన్నతాధికారులు సమావేశమై నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో అడవులు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. గ్రామాలకు సమీపంలో అటవీ ప్రాంతాలు ఉంటే వాటిని నగరవనాలుగా అభివృద్ధి చేయనున్నారు. నగర వనాల్లో పచ్చదనం పెంచనున్నారు. అలాగే టాయ్‌లెట్స్, బాత్‌రూమ్‌లు, చలువ పందిళ్లు, సిమెంటు బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. చిన్న పిల్లల పార్క్ తదితర వాటిని అభివృద్ధి చేస్తారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అడవుల్లో మంటలు విస్తరించకుండా ఎస్ఎంసీ కందకాలు తవ్వనున్నారు. రిజర్వు ఫారెస్ట్ ప్రాంతాల్లో కొత్తగా అమృత్ సరోవర్‌లు, పర్క్యులేషన్ ట్యాంకులు కూడా నిర్మించనున్నారు. గతంలో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు, చెరువులు, కుంటలను పునరుద్ధరించనున్నారు. అడవుల్లోని ఖాళీ ప్రదేశాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా చేపడతారు. ఇదిలా ఉండగా.. ఉపాధి నిధులతో అడవులను అభివృద్ధి చేయడానికి అటవీ అధికారుల నుంచి ప్రతిపాదనలు రావాల్సి ఉందని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. ప్రతిపాదనలు వస్తే గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు పంపుతామని పేర్కొన్నారు.



కర్నూలు సమీపంలోని నగరవనం (ఫైల్)

సెస్ వసూలుకు ప్రత్యేక బృందాలు

- జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ, ప్రైవేట్ భవన నిర్మాణ యజమానుల నుంచి సెస్‌ను వసూలు చేసేందుకు కార్మిక శాఖ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డీఆర్వో సమీక్ష నిర్వహించారు. భవన నిర్మాణాలు చేపట్టే యజమానులు మార్కెట్ విలువ ప్రకారం ఒక్క శాతం సెస్‌ను కార్మిక శాఖకు ఆన్‌లైన్ ద్వారా లేదంటే చలానా రూపంలో చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని భవన నిర్మాణాలు ప్రారంభించే సమయంలోనే యజమానులకు చెప్పి సెస్ వసూలు చేయాలన్నారు. వసూలు చేసిన సెస్‌ను కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలన్నారు. ప్రభుత్వం పరంగా పీఆర్, పురపాలక సంఘాలు, నగర పాలకసంస్థ ఇంజినీరింగ్, పారిశ్రామిక శాఖ, జిల్లా పరిషత్ తదితర శాఖలు ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసిన సెస్ వివరాలను డీఆర్వో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

భారీగా ఎస్ఐల బదిలీలు

కర్నూలు: పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల చివరి వారంలోగా అధికారుల బదిలీలు, పోస్టింగ్‌ల ప్రక్రియను పూర్తి చేయాలన్న కేంద్ర ఎన్నికల సంఘం సూచన మేరకు జిల్లా పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ చేపట్టారు. రెండు రోజుల క్రితం 13 మంది సీఐలకు స్థాన చలనం కలిగించగా.. శనివారం 19 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వి.శ్రీనివాసులు	హొళగుంద పీఎస్	రేంజ్ వీఆర్, కర్నూలు
టి.వి.ఎన్.చిరంజీవి	కర్నూలు త్రీటౌన్ పీఎస్	రేంజ్ వీఆర్, కర్నూలు
ఎం.మహమ్మద్ రఫి	వీఆర్, కర్నూలు (అటాచ్డ్ కర్నూలు తాలూకా యూపీఎస్)	రేంజ్ వీఆర్, కర్నూలు
ఎస్.ఎం.డి.జాఫర్ హుసేన్	కర్నూలు వన్‌టౌన్ పీఎస్	రేంజ్ వీఆర్, కర్నూలు
యు.ఎర్రన్న	వీఆర్, కర్నూలు (అటాచ్డ్ కర్నూలు తాలూకా)	రేంజ్ వీఆర్, కర్నూలు
కె.పి.ప్రహ్లాద	మంత్రాలయం పీఎస్	రేంజ్ వీఆర్, కర్నూలు
ఎం.కేశవ	మహిళా పీఎస్, కర్నూలు	డీఎస్‌బి, కర్నూలు (అటాచ్డ్ ఎలక్షన్ సెల్, కర్నూలు)
పి.మహమ్మద్ అలీ ఖాన్	కర్నూలు తాలూకా యూపీఎస్	డీఎస్‌బి, కర్నూలు
ఎస్.సోమ్లా నాయక్	కర్నూలు వన్‌టౌన్ పీఎస్ (అటాచ్డ్, కె.నాగలాపురం)	డీఎస్‌బి, కర్నూలు
యు.వేణుగోపాల్ రాజు	మంత్రాలయం పీఎస్	డీఎస్‌బి, కర్నూలు
ఎన్.సి.మల్లికార్జున	ఫ్యాక్షన్ జోన్, కర్నూలు	డీఎస్‌బి, కర్నూలు
సి.ఖాజావలి	కర్నూలు టూటౌన్	డీఎస్‌బి, కర్నూలు
ఎం.ప్రేమ	నాగలాపురం పీఎస్ (అటాచ్డ్ దిశ పీఎస్)	దిశ పీఎస్, కర్నూలు
కె.గోపీనాథ్	కర్నూలు టూటౌన్	సీసీఎస్, కర్నూలు
జి.దేవమణి	సీసీఎస్ కర్నూలు	పీసీఆర్, ఆదోని
ఎల్.విజయలక్ష్మి	ఆదోని త్రీటౌన్	వీఆర్ ఎస్పీ, కర్నూలు
ఎం.రామయ్య	ఆదోని త్రీటౌన్ పీఎస్	వీఆర్ ఎస్పీ, కర్నూలు
పి.శోభారాణి	వీఆర్, కర్నూలు (అటాచ్డ్ టూటౌన్, కర్నూలు)	వీఆర్ ఎస్పీ, కర్నూలు
జి.రాజన్న	కర్నూలు ట్రాఫిక్ పీఎస్	వీఆర్ ఎస్పీ, కర్నూలు

క్రీడలతో మానసిక ఉల్లాసం

- పోలీసు క్రీడల ప్రారంభ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు


పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ టి.సర్కార్


పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం సందర్భంగా కవాతు నిర్వహిస్తున్న కర్నూలు సబ్ డివిజన్ పోలీసులు

కర్నూలు : మానసిక ఉల్లాసానికి క్రీడలు చాలా అవసరమని అడిషనల్ ఎస్పీలు టి.సర్కార్, జి.నాగబాబు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటిరోజు పోలీసు క్రీడాకారులు కవాతు నిర్వహించి అడిషనల్ ఎస్పీలు సర్కార్, నాగబాబులకు పోలీసు క్రీడాకారులు గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది పొడవునా పోలీసులు విధులు నిర్వహించి మానసిక ఒత్తిడిని జయించడానికి ఆటవిడుపులా క్రీడలు ఉపకరిస్తాయన్నారు. ప్రతి సంవత్సరం పోలీసులకు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహిస్తున్నామన్నారు. కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ల పోలీసులతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో పనిచేస్తున్న మొత్తం 105 మంది పోలీసు క్రీడాకారులు మొదటిరోజు పాల్గొన్నారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, ట్రైనీ డీఎస్పీ భావన, ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాషాతో పాటు సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిరుద్యోగులకు టోకరా

బొమ్మలసత్రం: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి నంద్యాల పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో నివాసముంటూ నిరుద్యోగులకు టోకరా వేశాడు. హైదరాబాద్, బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ. 4 లక్షల దాకా వసూలు చేశాడు. బాధితులు 10 మంది శనివారం నంద్యాల టూటౌన్ సీఐ రాజారెడ్డికి ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

మూగజీవాలకు టీకాలు వేయడంలో నిర్లక్ష్యం వద్దు


లావణ్యలక్ష్మికి స్వాగతం పలుకుతున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడంలో నిర్లక్ష్యం వద్దని, ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమం చేపట్టాలని పశుసంవర్ధక శాఖ జిల్లా స్పెషల్ ఆఫీసర్, డైరెక్టరేట్ జాయింట్ డైరెక్టర్ లావణ్య లక్ష్మి తెలిపారు. శనివారం కర్నూలుకు వచ్చిన ఆమె ముందుగా కల్లూరు మండలం పెద్దటేకూరులో పశువులకు గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల సమావేశ మందిరంలో జిల్లాలోని పశువైద్యులు, సహాయ సంచాలకులతో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై సమీక్ష నిర్వహించారు. బ్రూసెల్లా, పీపీఆర్, గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల ప్రగతిని మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. కొన్ని మండలాల్లో పురోగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గడువులోపు పశు ఆరోగ్య కార్డులను పంపిణీ చేయాలని సూచించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు, ఏడీలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎమ్మిగనూరులో ఆంత్రాక్స్ కేసులు నమోదైనందున ఆ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ రామచంద్రయ్య, కర్నూలు, ఆదోని డీడీలు దుర్గాప్రసన్నబాబు, పి.వెంకటరమణ, బహుళార్థ పశువైద్యశాల డీడీ హేమంత్‌కుమార్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ రాజశేఖర్, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

‘వికసిత్’ యాత్రలకు కేంద్ర మంత్రి

- 9, 10, 11 తేదీల్లో నిర్వహణ
- ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో వికసిత్ భాతర్ సంకల్ప యాత్రలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్‌జి.సృజన అధికారులను ఆదేశించారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో జిల్లాలో జరిగే యాత్రలకు కేంద్ర ఆరోగ్య శాఖమంత్రి మనుసుఖ్ ఎల్.మాండవీయ హాజరు కానున్నారని పేర్కొన్నారు. శనివారం ఆమె తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కేంద్ర ఆరోగ్య శాఖమంత్రి నాలుగు చోట్ల కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. 9న కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం, 10న ఉదయం నందవరం మండలం కేంద్రంలో, మధ్యాహ్నం హొళగుంద మండలం గజ్జహళ్లిలో, 11న తుగ్గలి మండలం పగిడిరాయిలో పాల్గొంటారన్నారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి నోడల్ అధికారిగా ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ హరిప్రసాదు, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.